జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
WWW.DASHANEWS.COM
మంగళవారం
29-09-2026
సంపుటి 1 సంచిక 307
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



తిరుమలలో భక్తుల రద్దీ..
తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం
4లో

సైమన్ గో బ్యాక్‌లా..
'సర్' గోబ్యాక్

దేశమంతా ఒక్కటై తిరుగుబాటు చేయడం ఖాయం

20 కోట్ల ఓట్లను తొలగించాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం

మైనార్టీలను అణచివేసిన ప్రతిచోటా విప్లవం వస్తుంది

ఏబీవీపీ కార్యకర్తగా డీలిమిటేషన్ వద్దని చెబుతున్నా..

సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక



దిల్లీ: భారతీయులపై పెత్తనం చేయడానికి బ్రిటిషర్లు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశమంతా ఒక్కటై ఉద్యమించినట్లుగానే ఇప్పుడు 'సర్'ను నిరసిస్తూ.. దేశప్రజలంతా ఉద్యమించే కాలం ఎంతో దూరంలో లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును లాగేసుకోవడానికి ఎన్నికల సంఘం ద్వారా ప్రధాని మోదీ చేస్తున్న

..మిగతా 4వ పేజీలో ➔

దేశవ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలకు డిమాండ్ పెరిగింది కనుక అమలు చేసి తీరాల్సిందే. మోదీ ఇదివరకు గ్యారంటీలకు వ్యతిరేకంగా మాట్లాడేవారు. తర్వాత ఆయనే మోదీ గ్యారంటీ పేరుతో ప్రచారం చేయడం మొదలుపెట్టారు. హామీల విషయంలో సవరణలు చేయాలనుకుంటే.. ఇచ్చిన హామీల్లో 90% అమలు చేయకపోతే తర్వాత ఎన్నికల్లో పోటీకి ఆ రాజకీయపార్టీపై అనర్హత వేటు వేయాలి. అప్పుడే పథకాల అమలుకు సంబంధించిన ఆర్థిక ప్రణాళికలు కచ్చితంగా తయారు చేసుకుంటారు.



రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో
భద్రతకు ప్రాధాన్యం

దసరా నాటికి విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు: సీఎస్ సంజయ్ జాజు

దశ, రంగారెడ్డి: రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. సోమవారం విద్యాశాఖ అంశాలపై ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెసిడెన్షియల్ పాఠశాలలను కలెక్టర్లు క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఆహార విషబాధ, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఆహార తయారీ, నిల్వ, పంపిణీలో నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఆహారం నాణ్యత, పారిశుధ్యం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మౌలిక వసతులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల పర్యవేక్షణ కోసం రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని, సమస్యలు-పరిష్కార చర్యలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతికూల

సెమీ ఫైనల్‌గా ఖైరతాబాద్!

ఉప ఎన్నికపై ప్రధాన పార్టీల దృష్టి.. 'సర్' తర్వాత మిగిలే ఓట్లు ఎన్నో?



హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు.. ఖైరతాబాద్ ఉప ఎన్నికను సెమీఫైనల్‌గా భావిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత గ్రేటర్‌లో జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ గెలిచిన కాంగ్రెస్.. ఖైరతాబాద్‌లోనూ విజయం సాధించి నగరంలో పట్టును నిరూపించుకోవాలన్న వ్యూహంతో ఉంది. గత ఎన్నికల్లో ఖైరతాబాద్‌ను గెలుచుకున్న భారాస తిరిగి ఈ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా రాష్ట్ర రాజకీయాలకు ఓ సంకేతాన్ని పంపాలని భావిస్తోంది. రాష్ట్రంలో అధికారం సాధించే దిశగా ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్న భాజపా.. ఉప ఎన్నికలో గెలిచి కేడర్‌ను ఉత్సాహపరచాలని ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ తర్వాత జరిగే మొదటి ఎన్నిక కావడంతో ఈ రకంగా కూడా దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు గెజిట్ నోటిఫికేషన్ వెలువడినందున త్వరలోనే ఎన్నిక ఉండొచ్చని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. 2023 శాసనసభ ఎన్నికల్లో భారాస అభ్యర్థి దానం నాగేందర్‌కు 63,068 ఓట్లు రాగా, భాజపా అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 34,666, కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డికి 33,549 ఓట్లు వచ్చాయి. 28,402 ఓట్ల అధిక్యంతో భారాస గెలిచింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం.. దానం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంతోపాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి బరిలో దిగి ఓటమి పాలయ్యారు. భాజపా అభ్యర్థి కిషన్‌రెడ్డి ఎంపీగా గెలుపొందగా, భారాస అభ్యర్థి పద్మారావుకు మూడో స్థానం దక్కింది. కిషన్‌రెడ్డికి 4,73,012 ఓట్లు రాగా,

..మిగతా 4వ పేజీలో ➔



పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొనుగోళ్ల పై
పరిమితులు!

దిల్లీ: ప్రైవేటు చమురు సంస్థలైన జియోబీపీ, నయారా ఎనర్జీ డీజిల్ కొనుగోళ్లపై పరిమితులు విధిస్తున్నాయి. పరిశ్రమలు, బల్క్ వినియోగదారులు రిటెయిల్ ఔట్‌లెట్ల వద్ద కొనుగోళ్లు జరుపుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి. జియోబీపీ ఒక్కో కస్టమర్‌కు రోజుకు 50 లీటర్లు మాత్రమే విక్రయిస్తుండగా.. నయారా ఎనర్జీ మాత్రం 70200 లీటర్ల వరకు కొనుగోళ్లకు అనుమతిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వరంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, బీపీసీఎల్,

..మిగతా 4వ పేజీలో ➔

రూ.7.52 లక్షల కోట్ల సంపద ఆవిరి


6 నెలల కనిష్ఠానికి సూచీలు.. నెల రోజుల్లో 5% నష్టం

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.5,353.22 కోట్లు.. డీఐఐ కొనుగోళ్లు: రూ.5,189.02 కోట్లు



ముడి చమురు ధర ఆగకుండా పెరుగుతూ ఉండటం, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీయడంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ 1,124 పాయింట్లు కోల్పోయి 6 నెలల కనిష్ఠ స్థాయికి చేరగా, నిఫ్టీ 22,800 పాయింట్ల దిగువన ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 22 పైసలు తగ్గి 95.97 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.94% పెరిగి,

..మిగతా 4వ పేజీలో ➔



సరైన జీవనశైలే గుండెకు రక్షాకవచం

యువతరంలో గుండె జబ్బులు పెరుగుతున్నాయి. ఇది వ్యక్తిగత ఆరోగ్య సమస్య మాత్రమే కాదు; కుటుంబ ఆదాయం, పని సామర్థ్యం, సంస్థల ఉత్పాదకతపైనా ప్రభావం చూపుతుంది. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, పొగాకు వాడకం, వ్యాయామం లేకపోవడం, అనారోగ్యకర ఆహారం వంటివన్నీ ప్రమాద కారకాలే. వీటిని నియంత్రించడం ఎంతైనా అవసరం. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా... గుండె జబ్బులు కేవలం అనారోగ్య సమస్యలే కాదు, ఆర్థిక సవాళ్లనూ విసురుతాయి అవి. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం, 201230 మధ్య భారత్‌లో హృద్రోగాలు, మధుమేహం, క్యాన్సర్ కారణంగా సుమారు 2.5లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం

..మిగతా 4వ పేజీలో ➔



కేటీఆర్ సహా నలుగురి పాస్‌పోర్టుల తాత్కాలిక జప్తునకు ఆదేశం!

రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయానికి అనిశా న్యాయస్థానం లేఖ

ఫార్ములా-ఈ కేసులో కీలక పరిణామం

4లో

గుండెకు హాని చేసే అలవాట్లకు స్వస్తి పలకండి: కేర్ హాస్పిటల్స్ వైద్యుల పిలుపు

❖ ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద అవగాహన నడక

❖ హాజరైన చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫేకర్ అలీ



దశ, హైదరాబాద్: గుండెకు హాని కలిగించే అనారోగ్యకరమైన అలవాట్లను వీడి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కేర్ హాస్పిటల్స్ (నాంపల్లి) వైద్యులు సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చార్మినార్ వద్ద నిర్వహించిన భారీ అవగాహన నడక కార్యక్రమానికి స్థానికులు, విద్యార్థులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది సహా సుమారు 300 మంది హాజరయ్యారు. కేర్ హాస్పిటల్స్ చేపట్టిన 'టైమ్ టు బ్రేక్ అప్' ప్రచారంలో భాగంగా 'ఇట్స్ టైమ్ టు మూవ్ ఆన్' అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగతాగడం, జంక్‌ఫుడ్ తినడం, గంటల తరబడి కూర్చోవడం, నిద్రను నిర్లక్ష్యం చేయడం మరియు ఆరోగ్య పరీక్షలను వాయిదా వేయడం వంటి అలవాట్లను వీడాలని వైద్యులు పిలుపునిచ్చారు.

ముఖ్య అతిథిగా చార్మినార్ ఎమ్మెల్యే:
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫేకర్ అలీ మాట్లాడుతూ... గుండె జబ్బులు వచ్చిన తర్వాత చింతించడం కంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే మేలన్నారు. రోజూ శారీరక శ్రమకు సమయం కేటాయిస్తూ, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. చార్మినార్ కార్పొరేటర్ సయ్యద్ సోహైల్ ఖాద్రీ, మిస్టర్ పరల్డ్ బాడీబిల్డర్ మీర్ మోతెషమ్ అలీ గౌరవ అతిథులుగా పాల్గొని ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని కోరారు.

లక్షణాలు కనిపించకుండానే సమస్యలు
కేర్ హాస్పిటల్స్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమన్ సల్వాన్ మాట్లాడుతూ... బయటకు ఆరోగ్యంగా కనిపిస్తున్నప్పటికీ కొందరిలో రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ సమస్యలు గుర్తింపునకు రాకుండా ఉండే ప్రమాదం ఉందన్నారు. లక్షణాలు కనిపించే వరకు వేచి చూడకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు.

ప్రతి కుటుంబం తమలోని ఒక చెడు అలవాటును వదులుకోవడానికి తొలి అడుగు వేయాలని హెచ్‌సీఓఓ డాక్టర్ శశికాంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆశిష్ మాథుర్, ఎమర్జెన్సీ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రితేష్, మెహర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు హుసాముద్దీన్ సిద్ధిఖీ, సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి లడ్డూ రూ.1,22,222కు వేలం



దశ, పెద్ద అంబర్‌పేట్ : కుంట్లూర్ గ్రామంలో మంజునాథ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన భారీ గణనాథుడి లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన వేలంపాటలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చామ అను కిరణ్ రెడ్డి రూ.1,22,222లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కిరణ్ రెడ్డిని అభినందించారు. వేలం కార్యక్రమంలో యువత, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పండ్లు, బిస్కట్ల పంపిణీ చేసిన మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్



దశ ఓయూ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జాతీయ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సంకల్ప్ అభియాన్'లో భాగంగా హెచ్‌ఎంటీ నగర్ డివిజన్‌లోని పలు అంగన్వాడీ కేంద్రాలను మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ముచ్చటించి పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో సత్కరించి వారు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు యోగేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, ఎండీ అన్వర్, వేణుగోపాల్, శేఖర్‌గుప్తా, క్రాంతికుమార్, మంజులవాణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్లకు హెల్త్ కార్డుల పంపిణీ

దశ హుజూరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి ప్రాతినిధ్యంతో నూతన ఆరోగ్య పథకానికి సంబంధించిన పెన్షనర్ల హెల్త్ కార్డుల అప్లోడ్, డౌన్‌లోడ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ శ్రీమతి పార్వతి పర్యవేక్షణలో సిబ్బంది, ఈహెచ్ఎస్ సిబ్బంది సుమారు 200 మంది పెన్షనర్లకు హెల్త్ కార్డులను అప్పటికప్పుడు డౌన్‌లోడ్ చేసి స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి ప్రవీణతో పాటు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ప్రహ్లాదరావు, ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఏఎల్ఎన్ రావు, శ్యామ్‌రావు, నల్గొండ జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఇందర్‌సింగ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలి

❖ ఓటుహక్కు పరిరక్షణే నేటి యువత బాధ్యత: ఏఐవైఎఫ్



దశ, ఓయూ: భగత్‌సింగ్ కలలుగన్న భారతదేశ నిర్మాణం కోసం యువత, విద్యార్థులు కృషి చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 119వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఈసీఐఎల్‌లో ర్యాలీ నిర్వహించారు. జీహెచ్ఎంసీ నుంచి అంబేద్కర్ కూడలి వరకు భగత్‌సింగ్ చిత్రపటంతో ర్యాలీ చేపట్టి, అక్కడ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం ఓటుహక్కు పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ.. భగత్‌సింగ్ ఆశించిన స్వాతంత్ర్యం కేవలం బ్రిటిష్ పాలన నుంచి అధికార బదిలీ కాదని, దోపిడీ, అసమానతలకు ముగింపు పలికి సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక, ప్రజాస్వామ్య న్యాయంతో కూడిన సమాజ నిర్మాణమని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో చోటుచేసుకున్న తప్పిదాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు.

ఎస్ఐఆర్‌లో నమోదైన తప్పిదాలు, నోటీసుల ప్రక్రియ, ఓటర్ల ఇబ్బందులపై ఎన్నికల సంఘం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని అన్నారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, గిరిబాబు, చంద్రశేఖర్, ప్రతాప్, సుదర్శన్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం



దశ, జనగామ: సోమవారం రేబిస్ వ్యాధి దినోత్సవం సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా PO NCD డా. హరికృష్ణ మాట్లాడుతూ రేబిస్ వ్యాధి కుక్క కరవడం ద్వారా లేదా కుక్క నాకిన లాలాజలం ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. కుక్కలు, పిల్లులు లేదా ఎలుకలు కరిచిన వారు 24 గంటల్లోపు రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. అలాగే గాయాన్ని సబ్బు నీటితో శుభ్రంగా కడగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. సిద్ధార్థ రెడ్డి, వైద్యులు డా. అనురాధ, డా. రేవతి, NCD కోఆర్డినేటర్ రాజబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం

దశ, బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ అధికారుల తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో పేదలకు పట్టాలు అందించడంతో ప్రజలు తమ సొంత స్థలాల్లోనే ఇళ్లు నిర్మించు కుంటున్నారని తెలిపారు.పోస్టాఫీసు బస్తీకి చెందిన భాగ్యలక్ష్మికి ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకోలేదనే కారణంతో మున్సిపల్ అధికారులు రూ.5.79 లక్షల పెనాల్టీ విధించారని పేర్కొన్నారు. ప్రజలు ఇళ్లు నిర్మించుకునే సమయంలో అధికారుల చర్యలతో భయభ్రాంతులకు గురవుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారుల తీరుతో రియల్టర్లకు ప్రయోజనం కలిగే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు. బెల్లంపల్లి ప్రజల తరపున సమస్యలపై పోరాడేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని సుదర్శన్ అన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి



❖ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి



దశ, రంగారెడ్డి: ప్రజావాణిలో అందే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై మొత్తం 89 అర్జీలు సమర్పించారు. అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54, ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రతి అర్జీ పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నషాముక్తి భారత్‌పై విద్యార్థులకు అవగాహన



దశ, జనగామ : నషాముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా PO NCD డా. హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు.అలాగే 14416 టోల్‌ఫ్రీ నంబర్పై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. సిద్ధార్థ రెడ్డి, డా. అనురాధ, డా. రేవతి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా పక్వాడలో స్వచ్ఛతకు పెద్ద పీట

❖ తార్నాక నాగార్జున నగర్లో లో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం



దశ ఓయూ: ప్రధాన మంత్రి నరేందర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్వాడలో భాగంగా బీజేపీ నాయకులు మాదల రాధాకృ ష్ణ ఆధ్వర్యంలో సోమవారం తార్నాకలోని నాగార్జునగర్ కాలనీలో స్వచ్ఛత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సమన్వయంతో వీధుల్లో పేరుకుపో మన చెత్తను తొలగించారు.

అనంతరం తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న సేవా పక్వాడలో భాగంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటడం, నీటి వనరుల పరిరక్షణ పై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహాంకాళీ జిల్లా ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్, తార్నాక డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్, కృష్ణ గౌడ్, అనూష, సత్య, రవి, మోహన్ కృష్ణ, మహేష్, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాములతో జర భద్రం.!

- పొలం పనుల్లో అప్రమత్తత అవసరం
- కాటేస్తే మంత్రాలు, పసరు వైద్యంతో ప్రాణాలకు ముప్పే
- వైద్యుడిని సంప్రదించడం మేలు
- వైద్యమే శ్రేయస్కరం.. యాంటీ
- స్నేక్ వీనం ఇంజెక్షన్ తప్పనిసరి

తాండూర్, దశ ప్రతినిధి :

వర్షాకాలంలో అన్ని ప్రాంతాల్లోనూ పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పొలాలు, పొదలు, మమరుగు ప్రదేశాలు, పాడుబడిన ఇళ్లలో సర్పాలు ఎక్కువ సంచరిస్తాయి. వేసవి తాపం నుంచి సేదదీరేందుకు పాములు, ఇతర విషకీటకాలు పుట్టలు, పొడ ల్లోంచి బయటకు వస్తుంటాయి. సాధారణంగా పాలం పనుల్లో రైతులు, కూలీలు ఎక్కువగా పాముకాటుకు గురవుతుంటారు. అలాగే సంక్షేమ హాస్టళ్లు, స్కూళ్ల విద్యార్థులకు సైతం సర్పాల ప్రమాదం పొంచి ఉంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు పాములు, తేళ్లు, ఇంగ్లీ కాలు, జెర్రిలు వంటి విషకీటకాలు ఎక్కువగా తిరుగు తుంటాయి. ధాన్యపు గాదెలు, ఒందలు, పొలం గట్లు, సొప్ప కుప్పలు, గడ్డివాములో ఉండే కప్పలు, ఎలుక లను తినేందుకు పాములు వస్తుంటాయి. మరుగు. ప్రదేశాల్లో పాములు గుడ్లుపెట్టి పిల్లలు చేస్తాయి. ఇలాంటి ప్రదేశాల్లో సంచరించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. రాత్రి సమయాల్లో ఇటువైపు అస్సలు వెళ్లాడు. వెళ్లాల్సి వచ్చినా ట్రాబ్లైట్ తప్పక తీసుకెళ్లాలి ఇళ్లలో ఎక్కడా చెత్త చెదారం పేరుకోకుండా చూసుకోవాలి. గదుల్లో చీకటి లేకుండా చూసుకోవాలి. ఇళ్ల చట్టూ పరి శుభ్రంగా ఉంచుకోవాలి, పిచ్చిమొక్కలు, చెత్త ఉండనీ యొద్దు. ఇళ్ల కిటికీలకు, తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా పాముకాటుకు గురైతే నాటు వైద్యం, మంత్రాలను ఆశ్రయించకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకుపోవాలి. పాముకాటు విరుగుడుకు వైద్యులు 'యాంటీ స్నేక్ వీనమ్' ఇంజక్షన్ ఇస్తారు.



సర్పం కరిస్తే ఆలస్యం చేయొద్దు

పాముల్లో చాలా వాటికి విపముండదు. తాచు . పాటు, నాగుపాము, కట్లపాము, శెడుగు, శెట్టిర్కపాటు వంటి కొన్ని రకాల పాములు అత్యంత విషపూరితమై నవి కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తంలో కలుస్తుంది. వైద్యం అందకుంటే రెండు గంటల్లోపే ప్రాణాపాయం ఉంటుంది. బాధితుడ్ని వెంటనే అస్స త్రిలో చేర్పించాలి.

నాగుపాము కాటేసిన 15 నిమిషా ల్లోనే మనిషికి విషం ఎక్కుతుంది వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. రక్త పింజర, కట్ల పాము కాటేసిన రెండు గంట ల్లోగా విషం ఎక్కుతుంది. జెర్రీ పోతు, నీరుకట్ట కాటేసినా ఏమీ కాదు. వాటికి విషం ఉండదు. అయితే పాము ఏదైనా కరిచిన. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలి.

పాము ఎప్పుడు కాటేస్తుందంటే...

పొలం/కాలువ గట్లు, పశువుల కొట్టాలు, పొదలు, గడ్డివాములు, పాడుబడిన ఇళ్లు, కట్టెలు, పెంట దిబ్బల్లో పాములు తిష్టవేస్తూ బల్లులు, తొండలను తింటుం టాయి. స్టార్టర్ బాక్సుల్లోనూ పాములు చుట్టుకొని పంటాయి.

బాక్సుల డోర్లు తీసే సమయంలో జాగ్రత్తగా గమనించాలి. పాములకు ప్రాణభయం ఉన్నప్పుడు, వాటి ఏకాంతానికి భంగం కలిగినప్పుడు, తొక్కినప్పుడు క్షణ కాలంలో కాటేస్తాయి.

విషం ఎక్కితే ఇలాంటి లక్షణాలుంటాయి..

విషపూరిత పాము కాటేస్తే మనిషి శరీరం నీలంగా మారుతుంది. రక్తపోటు పెరిగి మనిషి స్రుహ కోల్పో తాడు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది.

పాము కొరల గాట్లు కన్పిస్తాయి. పొక్కులు, దద్దుర్లు వస్తాయి. నాలుక లావవుతుంది. నోటి నుంచి నురుగ వస్తుంది.

ఆందోళనతో ఎక్కువ ముప్పు

పాము కరిచిన వ్యక్తి ఎక్కువ ఆందోళన చెందొద్దు. లేదంటే బీపీ ఎక్కువై గుండెపోటుకు గురయ్యే ఆస్కారం ఉంటుంది. కొన్నిసార్లు విసం కంటే భయమే ప్రాణాంతకంగా పరిణ స్తుంది. ఆస్పత్రిలో పాము కాటుకు యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు ఉన్నాయి. పాము కరిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే రోగిని ఆస్పత్రికి తీసుకురావాలి. పసరు మందులు, మంత్రాలను నమ్మి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. పొలాల వద్ద రైతులు జాగ్రత్తగా మసలుకుంటూ పనులు చేసుకోవాలి. మరుగు ప్రదేశాల్లో నేరుగా చేతిని పెట్టొద్దు. అక్కడ పాములు, తేళ్లు ఉండే అవకాశాలున్నాయి.

- డాక్టర్ అమర్జిత్, ప్రభుత్వ ఆసుపత్రి,తాండూర్



నాచారంలో 70 గ్రాముల గంజాయి స్వాధీనం

❖ *ఒకరి అరెస్టు.. ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం*



దశ, ఓయూ: మల్లాపూర్ జనప్రియ లేన్ సమీపంలోని బాలాజీ ధాబా ఎదురుగా, ఎంఎస్ బిర్యానీ షాప్ వద్ద 70 గ్రాముల గంజాయిని నాచారం పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ నెల 27న అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వచ్చిన ముకేష్ చోహన్ (33)ను అదుపులోకి తీసుకునితనిఖీచేయగా..14ప్యాకెట్లలోసుమారు 70గ్రాములగంజాయి లభించింది. నిందితుడు బిహార్‌కు చెందిన ముకేష్ చోహన్ ప్రస్తుతం మల్లాపూర్ భవానీనగర్‌లో నివాసం ఉంటూ నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతడి వద్ద నుంచి గంజాయితో పాటు స్కై బ్లూ రంగు వివో వై16 సెల్‌ఫోన్, నేరానికి ఉపయోగించిన టీవీఎస్ స్పోర్ట్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడిని వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు నాచారం పోలీసులు తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

పగడాల నాగరాజు సేవలు అభినందనీయం



దశ, కామేపల్లి: ఖమ్మం పట్టణం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు సేవలు అభినందనీయం అని మద్దులపల్లి సర్పంచ్ పడిగ నాగమణి అన్నారు. సోమవారం కామేపల్లి మండలం, మద్దులపల్లి పాఠశాలలో విద్యార్థులకు పగడాల నాగరాజు జన్మ దినాన్ని కాంక్షిస్తూ ఆయన పెన్నులు,పరీక్ష ప్యాడ్లు,పండ్లు పంపిణీ చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. నాగరాజు దాతృతం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, మద్దులపల్లి ఉప సర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు, కామేపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ మోహన్ రెడ్డి, కాట్రాల రాంబాబు, సురేష్, కడారి సైదులు,కాట్రాల కోటయ్య, సామ నర్సిరెడ్డి, ఇమ్మడి వెంకన్న, తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

మంచిర్యాలలో ఘోర రోడ్డు ప్రమాదం



దశ, మంచిర్యాల: జిల్లాలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నస్పూర్ గేట్ సమీపంలోని జాతీయ రహదారిపై లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువతులు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది.మందమర్రి మండలంలోని గుడిపెల్లి,పొన్నారం గ్రామాలకు చెందిన యువతులు మంచిర్యాల పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం విధులకు వెళ్లేందుకు ఆటోలో బయలుదేరారు. నస్పూర్ గేట్ సమీపంలోకి చేరుకున్న సమయంలో ఎదురుగా వచ్చినలారీఆటోనుఢీకొన్నట్లుసమాచారం.ప్రమాదంలోఅత్తిలి సౌందర్య, చింతకుంట లక్ష్మితో పాటు మరో యువతి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురిని స్థానికులు, పోలీసులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గుడిపెల్లి, పొన్నారం గ్రామాల్లో విషాదం నెలకొంది. ప్రమాద ఘటనపై మంత్రి వివేక్ వెంకటస్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు సమాచారం.

రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించాలి



❖ *ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి: సీఎస్ సంజయ్ జాజు*

దశ, జనగామ: రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి భద్రత, ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్ష నిర్వహించారు. జనగామ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈసందర్భంగాసీఎస్‌మాట్లాడుతూకలెక్టర్లురెసిడెన్షియల్ విద్యాసంస్థలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్య వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార విషబాధ, పాము కాటు, ఎలుకల వంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు వెచ్చని నీరు, దుప్పట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల వివరాలు, సమస్యలు, పరిష్కార చర్యలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.

ప్రతి విద్యాసంస్థకు నోడల్ అధికారిని నియమించి ఆహారం, పారిశుద్ధ్యం, హాజరు, తాగునీరు, భద్రత తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు. బాలికల విద్యాసంస్థల్లో మహిళా అధికారులను నోడల్ అధికారులుగా నియమించి భద్రత, ఆరోగ్యం, కౌన్సెలింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై కూడా తగిన అవగాహన, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులు, సిబ్బంది ఎఫ్‌ఆర్ఎస్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. వంటశాలలు, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, హాస్టల్ గదుల పరిశుభ్రతను ప్రతిరోజూ పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, సంక్షేమ శాఖల అధికారులు, డీఎంహెచ్ఓ వాణిశ్రీ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి

దశ, జనగామ: మూడో విడత ఇందిరమ్మ ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడంతో పాటు, ఆ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూకు కనకరెడ్డి మాట్లాడుతూ.. జనగామ పట్టణంలో గతంలో ఇళ్ల స్థలాలు పొందిన పేదలకు మౌలిక వసతులు, గృహ రుణాలు అందక ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. తమ శక్తిమేరకు ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇంటి నంబర్లు కేటాయించి విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే ఆర్థిక స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేని 72 మంది లబ్ధిదారులకు గతంలో డ్రా ద్వారా కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తాం

❖ *చైర్‌పర్సన్ ఆరోపణలను ఖండించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు*



దశ, బెల్లంపల్లి: : బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఖండించారు. సోమవారం బెల్లంపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు సల్ల కృష్ణవేణి, తాండ్ర స్రవంతి మాట్లాడారు. కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి మాట్లాడుతూ.. తనపై రూ.10 లక్షలు తీసుకున్నట్లు చైర్‌పర్సన్ చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిరూపిస్తే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే చైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చేయాలని సవాల్ చేశారు. తన వార్డుకు చెందిన ఆర్పీ విషయంలో కావాలనే కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే పరువునష్టం కేసు వేస్తామని తెలిపారు. ఆర్పీకి నోటీసు ఇచ్చే విషయంలో చైర్‌పర్సన్ లెటర్‌హెడ్‌పై రాసి ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారని కృష్ణవేణి పేర్కొన్నారు. ఆర్పీలకు సంబంధించిన అంశాల్లో మరికొందరు రెండు పనులు చేస్తున్నప్పటికీ తన వార్డు ఆర్పీపైనే ఎందుకు చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. కౌన్సిలర్ తాండ్ర స్రవంతి మాట్లాడుతూ.. తమను చైర్‌పర్సన్ 'జస్ట్ కౌన్సిలర్లు'గా పేర్కొనడం బాధాకరమన్నారు. చైర్‌పర్సన్ కూడా తొలుత కౌన్సిలర్‌గానే ఎన్నికై, కౌన్సిలర్ల మద్దతుతోనే చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. కౌన్సిలర్లను తమ పార్టీలోకి తీసుకోబోమన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ బీఆర్ఎస్‌లో సాధారణ కార్యకర్తల నుంచి ప్రతి ఒక్కరికీ స్వాగతం ఉంటుందని తెలిపారు.రూ.10 లక్షల వ్యవహారంలో తనకు రూ.5 లక్షలు అందినట్లు నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని స్రవంతి అన్నారు. బెల్లంపల్లి ప్రజలకు ఎక్కడ సమస్య ఎదురైనా బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్యకర్తలు ప్రజల తరఫున నిలబడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని వారు తెలిపారు.

తిరుమలలో కొనసాగుతోన్న భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల రద్దీ కొనసాగుతోన్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) (TTD) కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1, 5వ తేదీల్లో బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 1న (గురువారం), అక్టోబర్ 5న (సోమవారం) ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు తెలిపింది. తిరుమలలో పెరటాసి మాసం, రాబోయే వరుస సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం రోజుకు సుమారు 80 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. దాదాపు మరో 30 వేల మంది భక్తులు తిరుమలలోనే నిరీక్షిస్తూ మరుసటి రోజు స్వామివారిని దర్శించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో సామాన్య భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉండే సమయం మరింత పెరుగుతోంది. దీంతో అధిక సంఖ్యలో సాధారణ భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పించేందుకు బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తితిదే వెల్లడించింది. బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన తేదీలకు సంబంధించి ముందు రోజు.. సెప్టెంబర్ 30న (బుధవారం), అక్టోబర్ 4న (ఆదివారం) సిఫార్సు లేఖలు స్వీకరించబోయేది లేదని స్పష్టం చేసింది. అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని గమనించి సహకరించాల్సిందిగా భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది.



సైమన్ గో బ్యాక్‌లా.. 'సర్' గోబ్యాక్

మొదటి పేజీ తరువాయి

కుట్రలను ప్రజలు సహించబోరని మండిపడ్డారు. మొత్తం 20 కోట్ల ఓట్లను తొలగించాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. అదే జరిగితే పేదవాడికి రాజ్యాంగం ప్రసాదించిన ఆయుధాన్ని లాక్కున్నట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్రలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఒక్కటి కావడం ఖాయమన్నారు. ఇందులో మమతా బెనర్జీ, శరద్‌పవార్, ఉద్ధవ్ ఠాక్రే, స్టాలిన్ అంతా ఒక్కటి కావాల్సిందేనని పేర్కొన్నారు. అస్సాంకు చెందిన 'ప్రతిదిన్' పత్రిక సోమవారం దిల్లీలో నిర్వహించిన సదస్సులో 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అన్న అంశంపై రేవంత్‌రెడ్డి మాట్లాడారు.



మోదీ వ్యతిరేకుల ఓట్లను తొలగిస్తున్నారు

''భారత్‌పై పెత్తనం చెలాయించడానికి బ్రిటిషర్లు 1928లో సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఏడుగురు సభ్యులూ బ్రిటిష్ వారే. అంతా మీరే ఉంటే మాకు న్యాయం జరగదంటూ లాలా లజపతిరాయ్ సైమన్ గోబ్యాక్ పేరిట నినదించి దేశాన్ని ఒక్కటి చేశారు. ఆ పోరాటంలో ఆయన అసువులు బాశారు. తర్వాత ఆ జెండా పట్టుకొని భగత్‌సింగ్ బయలుదేరారు. ఆ ఉద్యమమే తర్వాత దేశ స్వాతంత్ర్యానికి తోవ చూపింది. దాదాపు వందేళ్ల తర్వాత ఇప్పుడు.. మోదీ కూడా అదే తరహాలో ఎన్నికల సంఘాన్ని అనుకూలంగా మలుచుకొనే ఎత్తులు వేస్తున్నారు. 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత తొలిసారి ఓటును రిజిస్టర్ చేయడం కోసం ఫాం 6లో తండ్రులు, తాతల గురించి అడిగారు. దేశవిభజన జరిగిన తర్వాత ఎవరు ఎక్కడి నుంచి వచ్చారో తెలుసుకోవడానికి ఆ నిబంధన పెట్టారు. ఆ తర్వాత జరిగిన ఎస్ఐఆర్‌లు అన్నీ ఓటు హక్కు ఇవ్వడానికి చేపట్టగా.. ఇప్పుడు తొలగించడానికి చేస్తున్నారు. 2014లో దేశంలో 81 కోట్ల మంది, 2019లో 91 కోట్ల మంది, 2024లో 97 కోట్ల మంది ఓటర్లు ఉండేవారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు దేశ జనాభా 35 కోట్ల నుంచి 140 కోట్లకు పెరిగింది. ఓటుహక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించాం. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించడం వెనకున్న ఉద్దేశం ఏంటి? సామాజిక మధ్యమాల్లో మోదీకి వ్యతిరేకంగా ప్రచారం చేసే వారిని ఏఐ ద్వారా గుర్తించి వారందరి ఓట్లను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకే అధికారాలన్నీ బూత్‌స్థాయి నుంచి తొలగించి కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెట్టుకున్నారు. ఈసీఐ.నెట్ వెబ్‌సైట్ నిర్వహించే అధికారాన్ని పూర్తిగా దిల్లీలో కేంద్రీకృతం చేశారు. దానివల్ల ఎవరిని చేరుస్తున్నారు.. ఎవరిని తొలగిస్తున్నారన్నది కిందిస్థాయి వారెవరికీ తెలియదు. కమిషన్‌లోని ముగ్గురు సభ్యుల్లో మిగతా ఇద్దరికీ ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. ఉత్తరకొరియాలో ఎన్నికలు జరిగినా అక్కడ 100% మంది ఆ దేశాధ్యక్షుడు కిమ్‌కు ఓటేయాల్సిందే. ఇప్పుడు జ్ఞానేశ్‌కుమార్‌ను అక్కడికి పంపి శిక్షణ ఇప్పిస్తే 100% మంది మోదీకి ఓటు వేసేలా చేస్తారు'' అంటూ రేవంత్ ఎద్దేవా చేశారు.

సదస్సులో వ్యాఖ్యాత ప్రశ్నలకు బదులిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సంఖ్యాబలం ఉంటేనే గౌరవం

''రాజకీయాల్లో నంబర్ ఉంటేనే గేమ్ నడుస్తుంది. మన దగ్గర సంఖ్యాబలం ఉంటేనే దిల్లీలోని పెద్దలు పిలిచి కూర్చోమంటారు. లేదంటే గేట్‌లోకి కూడా రానివ్వరు. మోదీ.. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల పేరుతో లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచి పెద్ద రాష్ట్రాలను మరింత పెద్దగా చేసి, చిన్న రాష్ట్రాలను చంపేయాలనుకుంటున్నారు. దక్షిణాదిలో ప్రస్తుతం 132 సీట్లున్నాయి. కొత్తగా 66 వచ్చినా మొత్తం సీట్లు 198కి చేరవచ్చు. 850కి పైగా కాబోయే లోక్‌సభ సీట్లలో.. దక్షిణాదివి పోను.. దాదాపు 650 సీట్లు ఉత్తరాది చేతుల్లో ఉంటాయి. అప్పుడు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు దక్షిణాది అవసరమే ఉండదు. అదే జరిగితే మా గురించి ఏం పట్టించుకుంటారు? ఇప్పటికే కేంద్రంలో అన్ని ముఖ్యమైన మంత్రి పదవులను ఉత్తరాది వారికే కట్టబెట్టారు. రాబోయే రోజుల్లో ఇంకేమీ లభించే పరిస్థితి ఉండదు.

'రాముడిని చోరీ చేసింది..

ఉత్తరాది వారు ఆర్యన్‌లు, దక్షిణాదివారు ద్రావిడులు. మేం శివభక్తులమైతే ఉత్తరాదివారు రామభక్తులు. అందుకే రాముడిని భాజపా చోరీ చేసింది. మోదీ సహా భాజపా నాయకులంతా ఎక్కడైనా జైశ్రీరామ్ అంటారే తప్ప.. హరహర మహాదేవ్ అని అనరు. శివుడు పేదల దేవుడైతే, రాముడు ధనికుల దేవుడు. భాజపా ధనవంతుల పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతానికి 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ స్థానాలు ఉండటంవల్ల మా మీద ఎప్పుడూ జులుం చలాయించేవారు. మేం పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఇలా మైనార్టీలను అణచివేసిన ప్రతిసారీ ప్రపంచవ్యాప్తంగా విప్లవాలు పుట్టుకొచ్చాయి. అందుకే మోదీ ప్రజల మనసులను గెలుచుకోవాలి తప్ప.. నియోజకవర్గాల విభజన కాదు. ఇది దేశానికి కూడా ప్రమాదకరం. ఏబీవీపీ కార్యకర్తగా ఇది నా ఆందోళన. ఇది కేవలం కాంగ్రెస్ భావనే కాదు.. దేశం మొత్తం అభిప్రాయం. ఈ దేశ ప్రజలు అత్యంత తెలివైనవారు. అందుకే వారి ఓటును తొలగించడంపై మోదీ దృష్టి సారించారు.

ప్రతిదీ గుజరాత్‌కేనా..

పనిచేసే ముఖ్యమంత్రులకు చేయూతనందించాలన్న మన్మోహన్‌సింగ్ లాంటి విశాల దృక్పథాన్ని మోదీ కూడా కనబరిస్తే బాగుంటుంది. మా వద్ద మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్డు, జాతీయ రహదారుల నిర్మాణాలకు అనుమతివ్వలేదు. 360 కి.మీ. రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు ప్రధానమంత్రి కార్యాలయంలో రెండేళ్లుగా పెండింగ్‌లో పడి ఉంది. అంతా పీఎంవోలోనే ఉందంటూ కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ చేతులెత్తేశారు. గుజరాత్ వద్ద పోర్టులు ఉంటే మా వద్ద మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల లాంటి మేధావులున్నారు. మాకు సెమీ కండక్టర్ పరిశ్రమ ఇచ్చి.. చివరి నిమిషంలో గుజరాత్‌కు తీసుకెళ్లారు. ఇప్పుడు నార్త్ వర్సెస్ సౌత్ అని కాకుండా గుజరాత్ వర్సెస్ మిగతా దేశం అన్న విధానం నడుస్తోంది. ఎన్నికల్లో మోదీ ఉత్తర్‌ప్రదేశ్ నుంచి గెలిచినా ప్రతిదీ గుజరాత్‌కే తీసుకెళ్తున్నారు. తెలంగాణలో మేం విద్యార్థులుగా ఉన్నప్పుడు లెఫ్ట్, రైట్ వింగ్ సంఘాలే ఉండేవి. ఎన్ఎస్‌యూఐ ప్రభావం ఉండేది కాదు. నేను ఏబీవీపీలో చిన్నప్పటి నుంచీ ఉన్నాను. అప్పట్లో భాజపా ప్రభావం లేనందున.. ఏబీవీపీలో పనిచేసిన వారు తదనంతర కాలంలో కాంగ్రెస్‌లో చేరేవారు. నేను ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికే నాటి ప్రతిపక్షమైన తెదేపాలో చేరాను. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో తెదేపా ప్రభావం తగ్గిపోవడంతో 2017లో కాంగ్రెస్‌లో చేరాను. రాహుల్‌గాంధీని కలిసిన తర్వాత ఆయనే నా నాయకుడని నిర్ణయించుకున్నాను'' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.



రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో భద్రతకు ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

నివేదికలు వచ్చిన వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, వాస్తవ సమస్య అయితే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు వెచ్చని నీరు, దుప్పట్లు అందుబాటులో ఉంచాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న విద్యాసంస్థల భవన యజమానులతో సమావేశమై అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతిరోజూ లక్ష యూనిఫాంలు కుట్టేలా చర్యలు తీసుకుని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫాంలు అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులతో సమీక్షిస్తూ విద్యార్థుల సంక్షేమ పథకాల అమలులో పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. FRS, విద్యార్థుల వివరాల నమోదు, ధ్రువీకరణ, టీసీలు, పాఠశాల మార్పులు, డ్రాప్‌బాక్స్‌లో పెండింగ్ వివరాలు తదితర అంశాలను పర్యవేక్షించాలని సూచించారు. ఆధార్ మిస్‌మ్యాచ్‌లు, ఆన్‌లైన్ పెండింగ్ దరఖాస్తులు, ఇతర సాంకేతిక సమస్యలను వారంలోగా పరిష్కరించాలని, యూనిఫాం క్లాత్ సరఫరా, స్టిచింగ్‌లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ అంశాలపై మంగళవారం సాయంత్రంలోగా స్పష్టమైన పురోగతి నివేదిక అందించాలని, నిర్లక్ష్యం లేదా సమన్వయ లోపంతో ఏ పని నిలిచిపోకుండా అధికారులు వ్యక్తిగత బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, పీడీ డీఆర్‌డీఏ శ్రీలత, పీడీ మెప్మా వెంకట్ నారాయణ, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, బీసీ వెల్ఫేర్ అధికారి కేషురామ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వెంకటేష్, మైనార్టీ అధికారి, సంబంధిత ఆర్‌సీలు, అధికారులు పాల్గొన్నారు.

సరైన జీవనశైలే గుండెకు రక్షాకవచం

మొదటి పేజీ తరువాయి

సంభవించవచ్చు. ఈ నేపథ్యంలో యువత ఆరోగ్యకర జీవనశైలికి ప్రాధాన్యమివ్వాలి. మహిళల్లోనైతే సాధారణ ప్రమాద కారకాలతో పాటు కొన్ని పునరుత్పత్తి సంబంధిత అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. 45 ఏళ్లకు ముందే రుతుస్రావం శాశ్వతంగా ఆగిపోవడం, గర్భధారణ సమయంలో మధుమేహం లేదా అధిక రక్తపోటు, ముందస్తు ప్రసవం వంటి అంశాలు భవిష్యత్తులో గుండె జబ్బుల ప్రమాదాన్ని అంచనా వేయడంలో ఉపయోగపడతాయి.

ప్రమాదాన్ని పసిగట్టాలి

స్పెయిన్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజీ పరిశోధకుడు డాక్టర్ వాలెంటిన్ ఫ్యూస్టర్ నేతృత్వాన 'పెసా' చేపట్టిన పరిశోధనలో... ఎలాంటి హృద్రోగ లక్షణాలు లేని 4054 ఏళ్ల వ్యక్తుల్లోనూ రక్తనాళాలు కుంచించుకుపోవడం (ఎథెరోస్క్లెరోసిస్) వంటివి చోటుచేసుకుంటున్నట్లు తేలింది. ఇది లక్షణాలు రాకముందే ప్రమాదాన్ని గుర్తించాల్సిన ప్రాధాన్యాన్ని చెబుతుంది. గుండె ఆరోగ్య పరిరక్షణ లక్ష్యం బ్లాకేజీని మాత్రమే గుర్తించడం కాదు ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి, ప్రతి వ్యక్తికీ తగిన చికిత్స, నివారణ మార్గాన్ని ఎంచుకోవడం ముఖ్యం. గుండె ధమనుల్లో బ్లాకేజీ కనిపించగానే స్టెంట్ లేదా బైపాస్ చేయాల్సిన అవసరం తప్పనిసరి అనుకోకూడదు. బ్లాకేజీతోపాటు, అది గుండెకు రక్తప్రవాహాన్ని ఎంతమేర ప్రభావితం చేస్తోందో తెలుసుకోవడం ఆధునిక వైద్యంలో కీలకంగా మారింది. అందుకే బ్లాకేజీ ఎంత? అనేది నిర్ధారించడంతోపాటు, దాని ప్రభావం ఎంత?అనేది చూడటమూ ముఖ్యమే. రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం వంటి వాటిని అదుపులో ఉంచుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవాలి. వ్యాయామాన్ని పూర్తిగా విస్మరించడం ప్రమాదకరమవుతుంది. అదే సమయంలో కసరత్తుల విషయంలో అశాస్త్రీయంగా వ్యవహరించకుండా యువత అప్రమత్తంగా ఉండటమూ ప్రధానమే.

కేటీఆర్ సహా నలుగురి పాస్‌పోర్టుల తాత్కాలిక జప్తునకు ఆదేశం!

రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయానికి అనిశా న్యాయస్థానం లేఖ

ఫార్ములా-ఈ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 'ఫార్ములాఈ రేస్' కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇందులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తోపాటు మరో ముగ్గురి పాస్‌పోర్టు ఇంపౌండ్(తాత్కాలిక జప్తు) చేయాలంటూ అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు ఇటీవల న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు అనిశా న్యాయస్థానం హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని(ఆర్పీవో) ఆదేశిస్తూ లేఖ రాసింది. కేటీఆర్‌తోపాటు మిగతా వారి పాస్‌పోర్టు ఇంపౌండ్ చేసే పక్షంలో ఫార్ములాఈ కేసు మరోమారు చర్చనీయాంశంగా మారనుంది.

సెమీ ఫైనల్‌గా ఖైరతాబాద్!

మొదటి పేజీ తరువాయి

దానం నాగేందర్‌కు 4,23,068, పద్మారావుకు 1,29,586 ఓట్లు వచ్చాయి. ఇదే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రం భారాసకు ఆధిక్యం రాగా, రెండో స్థానంలో కాంగ్రెస్, మూడో స్థానంలో భాజపా నిలిచాయి. ఇక్కడ పద్మారావుకు 67,368 ఓట్లు, దానం నాగేందర్‌కు 45,358, భాజపాకు 38,094 ఓట్లు వచ్చాయి. లోక్‌సభ ఫలితంలో భారాస మూడో స్థానంలో నిలిచినా.. ఖైరతాబాద్‌లో మాత్రం 22 వేల ఓట్ల ఆధిక్యం సాధించడం ఆ పార్టీకి ఉన్న పట్టుకు నిదర్శనం. కానీ వచ్చేది ఉప ఎన్నిక కావడంతో అనేక అంశాలు ప్రభావం చూపుతాయని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.



అభ్యర్థులెవరో..

ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి దానం నాగేందర్ పోటీ చేయడం దాదాపు ఖరారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన విజయారెడ్డి తదితరులు కూడా ప్రయత్నించే అవకాశం ఉంది. భారాస అభ్యర్థి ఎవరన్నది కీలకం కానుంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయికిరణ్, కార్పొరేటర్‌గా పనిచేసిన మన్నె కవితారెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు ప్రయత్నిస్తుండగా, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. భాజపా తరఫున మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మళ్లీ బరిలోకి దిగే అవకాశాలుండగా.. ఇంద్రసేనారెడ్డి, జూటూరి కీర్తిరెడ్డి తదితరులు కూడా ప్రయత్నిస్తున్నారు. మూడు పార్టీలు ఈ స్థానాన్ని దక్కించుకోవడానికి హోరాహోరీగా పోరాడనున్నాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రభావం ఉప ఎన్నికపై ఏ మేరకు ఉంటుందన్నది కూడా చర్చనీయాంశం. ఈ నియోజకవర్గంలో 2026 జూన్ 10 నాటికి 2,93,667 మంది ఓటర్లుండగా, సర్‌తో 1,70,195 ఓట్లు డిజిటలైజేషన్ జరిగింది. ఏఎస్‌డీడీ (అబ్సెంట్, షిఫ్ట్, డెత్, డూప్లికేట్) కింద 1,23,472 ఓట్లు తొలగించారు. మిగిలిన 1,70,195 ఓట్లలో అన్నీ సక్రమంగా ఉన్నవి 88,792. మిగిలిన 81,403 మందికి నోటీసులు ఇవ్వగా, 35 వేల మంది నిర్దిష్ట వ్యవధిలోగా హాజరుకాలేదు. 30 వేల మంది నోటీసులకు సమాధానాలు, ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. మిగిలిన వారికి సంబంధించిన పరిశీలన కొనసాగుతోంది. సర్ ప్రక్రియ ముగిశాకే ఓటర్ల సంఖ్య ఎంత అన్నది తేలనుంది. ఈనాడు, హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానం 2024 ఏప్రిల్ 23 నుంచే ఖాళీగా ఉన్నట్లు శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. 2023 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి నుంచి గెలిచిన దానం నాగేందర్ అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచే అమల్లోకి వచ్చినట్లు తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు మేరకు ఈ నోటిఫికేషన్ జారీ చేసినట్లు శాసనసభ కార్యదర్శి తెలిపారు.

రూ.7.52 లక్షల కోట్ల సంపద ఆవిరి

మొదటి పేజీ తరువాయి

106.34 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై సూచీలు నష్టపోగా హాంకాంగ్ సూచీ లాభపడింది. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో కదలాడాయి. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ సోమవారం ఒక్కరోజే రూ.7.52 లక్షల కోట్లు తగ్గి రూ.474.36 లక్షల కోట్ల (4.94 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. గత నెల రోజుల్లో కలిపి సూచీలు 5% వరకు నష్టపోగా, మదుపర్ల సంపద రూ.17.17 లక్షల కోట్ల మేర ఆవిరైంది. సెన్సెక్స్ ఉదయం 73,734.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,895.74 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ 73,740.85 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 72,716.23 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 1,124.02 పాయింట్లు నష్టపోయి 72,771.72 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 360.25 పాయింట్లు తగ్గి 22,780.25 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో 29 నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ 2.62%, అదానీ పోర్ట్స్ 2.38%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.30%, హెచ్‌యూఎల్ 2.27%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.24%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.90%, బీఈఎల్ 1.78%, ట్రెంట్ 1.71%, ఎన్‌టీపీసీ 1.59%, ఐటీసీ 1.45% తగ్గాయి. ఇన్ఫోసిస్ ఒక్కటే 0.20% పెరిగింది. జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్ ఐపీఓ రెండో రోజుకే 5.14 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 1,60,62,879 షేర్లను ఆఫర్ చేయగా, 8,25,13,478 షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. రిటెయిల్ విభాగంలో 6.15 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 7.82 రెట్లు, క్యూఐబీ విభాగంలో 1.34 రెట్ల అధిక స్పందన దక్కింది.

పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొనుగోళ్ల పై పరిమితులు!

మొదటి పేజీ తరువాయి

హెచ్‌పీసీఎల్ కూడా విక్రయాలపై పరిమితులు విధించే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా ప్రస్తుతం బ్యారెల్ చమురు ధర 108 డాలర్లు పలుకుతోంది. అయితే, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు మే నెల నుంచి రిటెయిల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉంటున్నాయి. అదే సమయంలో పరిశ్రమలు, బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధరలు అంతర్జాతీయ రేట్లకు అనుగుణంగా పెరిగాయి. దీంతో రిటెయిల్ పంపుల వద్ద లభించే డీజిల్‌కు, బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్‌కు మధ్య లీటరుపై దాదాపు రూ.40 వరకు వ్యత్యాసం ఉంటోంది. ఈ క్రమంలో బల్క్ వినియోగదారులు రిటెయిల్ పంపులను ఆశ్రయిస్తున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com